# ప్రస్థానం

పంజగొట్టిన కిచిడిగడ్డితో వేసిన రెండు గదుల చిన్న గుడిసె. గుడిసెముందు ఐదారు గజాల వాకిలి. చిన్న ప్రహరీగోడ. గోడవతల రెండు మూడు గజాల దూరంలో రోడ్డు, రోడ్డు, పరారీ గోడల మధ్యన జాలారి. దాన్నిండా దుర్గంధం, బురద, ఈగలు, దోమలు. వాకిట్లోవాల్చున్న మలక మంచంలో కూర్చున్నాడు మాధవయ్య. అదేమంచంలో కాళ్ళ కట్టదిక్కు రాఘవయ్య కూర్చున్నాడు. ఇద్దరూ ముప్పయేండ్లలోపు వయసు వాళ్ళే. అయినా వాళ్ళ కళ్ళు లోతుకు పోయి కంటె బొక్కలు తేలి టీ. బీ పేషంట్లలా, వయసుకు మించిన వాళ్ళలా అగుపడ్తారు. గోడ ప్రక్కన వాకిట్లో అంటించి పెట్టిన బొగ్గు పొయ్యినుండి ''గుప్ గుప్'' మని పొగవస్తుంది.

''పొగపాడుగాను వశపడుతలేదు'' అని మాధవయ్య. లుంగీతో కళ్ళ వెంట కారే నీటిని తుడుచుకున్నాడు.

కండ్లముందుసంగీతం పాడుతున్న దోమను ఛల్ అని చేత చంపి '' ఊళ్ళెకు పొయ్యొత్తివిగద బావ! ఊళ్లంత మంచిదేనా?'' అన్నాడు రాఘవయ్య.

''ఆం'' అంతా బాగే...

''అడ్లే పొటచ్చినయి''

''తిండికెళ్ళుతె మాయెక్కో. పెట్టుబళ్ళ మందమన్న రాకపాయె'' వీళ్ళు మాట్లాడు కుంటుండగానే ''హుప్'' మని జాలారి పై నుంచి దూకితలుపుతీసుకొని ఓదెలు లోపలికొస్తూనే

'' ఇయ్యంపుడా బాగున్నవా?'' అని మాధవయ్య నడిగాడు.

''ఆ ఆ ఇగ గిట్లున్న'' అని ''సుగుణా గా మంచమాల్చు మీ అన్నచ్చిండు'' అన్నాడు మాధవయ్య.

మంచం వాల్చడానికొస్తున్న మాధవయ్య భార్య నుద్దేశించి ఓదెలు ''నేనువాల్చకుంట తియ్యి పోచెల్లె'' అని అక్కన్నేవున్న మంచం వాల్చుకోని కూర్చున్నాడు.

బొగ్గుపొయ్యి పొగతో వాకిలంతా నిండింది. ఊపిరి తీసుకోరావడం లేదు. రోడ్డుపై అటూ ఇటూపోయే వాహనాల చప్పుడు.

''సుగుణా గీ పొగ మొసమర్లవిత్తలేదు. పొయిదీంసుకపొయ్యి గోడవతల పెట్టిరా'' అన్నాడు

మాధవయ్య.

సుగణ బకెట్ తీసుకెళ్ళి పరారి గోడవతల పెట్టి వచ్చింది. పొగ వాళ్ళ దిక్కు రావడం కొంత తగ్గింది.

ఇంతలో ''నమస్తె పటేలా'' అనుకుంటు రాజలింగు లోపల కొచ్చాడు.

''నమస్తేర రాజలింగు. బాగున్నావుర. సానరోజుల్నుంచి కనపడతలేవేందిర?'' అన్నాడు మాధవయ్య.

'' ఏం బాగ పటేల గ్యాసు పడుత లేపాయె. పానం మంచిగలేక పదిగేన్రోజులుపిక్ జేసిన'' అన్నాడు రాజలింగు.

''గట్లనా ఎట్లున్నోని వెల్లయినవుర ఇటచ్చి కూచో'' అని ఓదెలు మంచంలో ఓ పక్కకు ఒరిగాడు.

''గా ముట్టుల్లు గిక్కడున్నాయిర. అట్ల మంచం మీద కూసుండు'' అన్నాడు రాఘవయ్య.

రాజలింగుమంచెం పట్టె మీద కూర్చున్నాడు.

'' ఏంర రాజలింగు పనెట్లుందిర?'' అన్నాడు మాధవయ్య.

'' పనా? పటేల పనికి పోవన్నంటె పికర్ జొత్తంది. మాస్టర్ నడ్డదంటె అగులు బుగులయితది. బాయిల దిగిన మంటె మల్ల మీదికచ్చే నమ్మకంలేకనేపాయె. లోపల్నే ఊరిసెట్టు పోవన్నాయె. లోపల గరిమి సెముట మన్ను మసానం. మీద ఎంతానగొట్టినా లోపల ఒగగరిమిగాదు. నాత్రి బజలచ్చిందట్టె ఇగ బుగులు ఇంకెక్కో ఐతది నాత్రంత దయ్యాలోలెకండ్లు నిలేసుకొని మిటమిట సూసుకుంటనే ఉండున్నాయె. తెల్లారి పొద్దందుక పన్నా నిదురసాలది. అంతెల్లనో అయితది. మల్లఅడ్డుమాస్ పందామన్నా ఆ సాపెలుపు గుడిసెలెల్ల పండత్తది. నీయవ్వ ఇండ్లేమో ఉంటదనుకొనత్తిగని ఏం పాడయింద. రోజు రోజుకోకొత్తపుటక పుట్టినట్టేనాయె. గా నెలకింద బదిలీ పిల్లరు నేను మిటమిట సూడంగానే పెల్లగూలి సచ్చిండు గప్పట్నుంచి ఇంకా పనికి పోవన్నంటె ఒంటెలుక పడుతంది'' అన్నాడు రాజలింగు.

''బాయిల పన్జేసెటోల్లకు గవ్వన్ని మాకు తెలుపదార. నడిపియ్యాలె ఎట్లనో ఓ తీరుగ'' అన్నాడు మాధవయ్య.

గుడిసెలనుంచి వాకిట్లకచ్చిన సుగుణ మంచం మీద కూర్చున్న రాజలింగు నదోలా చూసింది.

''సుగణా స్టౌమీద కొంచెం చాపెట్టు'' అన్నాడు మళ్ళీ మాధవయ్య.

''చా వద్దేమద్దు. గిప్పుడెందుకు తియ్యి'' ఓదెలన్నాడు.

''మీ ఇంటి కచ్చినప్పుడు ఇయ్యవడుద్దని అంటున్నావోయ్‌సాలయినె ఇయ్యకుంటెమానాయె తియ్యి'' మాధవయ్య అన్నాడు.

''నీదేం బొయింది కూసుండి అజ్జెయ్య ఇది సెయ్యమంటావు. కట్టపడేది మా సెల్లేనాయె'' రాఘవయ్యన్నాడు.

''గట్ల జెప్పవులసలు సంగతి. మీ సెల్లెకు బరువయిద్దనేనా మీ తిప్పలంత ఏంగాదుతియ్యి. గీంత కట్టపడందెట్ల?'' మాధవయ్య.

''నాక్కట్టమెక్కడిది? ఇక్కడికచ్చి కొంచెం సుఖపడుతున్ననా? కాలేరు బతుకు పాడుగాను. ఎనుకెవ్వడు ముంద టెవ్వడు. గంటల కొద్ది కాళ్ళు పీక్కపోంగ నీళ్ళ పంపుకాడ నిలవడన్నా రాళ్ళ సొంటి బొగ్గు కొట్టికొట్టిసేతులన్నినాశినమాయె. ఈ పంది గుడిసెల్లల్ల లోపలికి పోవన్నన్నా బయటికి రావన్నన్నా

దేవునిగుల్లె కంగిపోయి నట్టంగి పోవన్నాయే, పసురాలకంటె ఈ నంగ బతుకుడాయె'' ''గీ పొల్లగాన్ని వట్టుకో, స్తైలంటివెడుత'' అని పంకలో పిల్లన్ని మాధవయ్య కిచ్చి లోపలికి పోబోయింది సుగుణ.

''ఇగ కష్టమో సుఖమో సుకపడె రాతుంటె గిక్కడికెందుకత్తం సెల్లె'' రాఘవయ్యన్నాడు.

సుగుణ ఆ మాటలు వింటూ లోపలికెళ్ళింది.

''అన్నలు సెల్లెండ్లంత ఒక్కటైనట్టున్నరు. ఇక పరాయోన్ని నేనొక్కన్నే కనబడుతన్నిక్కడ'' మాధవయ్య హాస్యంగా అన్నాడు.

''ఎట్లయిన మా సెల్లెదిక్కుగాకుంటెనీదిక్కంటమాగని. చానీళ్ళ తోనే ఎల్లగొడుతావోయ్. ఇంటికచ్చినోల్లకేమన్న మర్యాజ్జేసుడున్నదా లేదా?'' ఓదెలన్నాడు.

''ఏమిటితోంజెయ్యమంటవుమర్యాద. దుడ్డు కట్టెతో జెయ్యన్నా''

''మంచిగనే ఉంది మర్యాద. సుట్టమయ్యత్తె దయ్యమై పట్టినట్టుంది. మీ ఇంటిల వర్సనేగట్లున్నదా ఏంది? ఇంతసారానో, బరండో తెప్పియ్యాలెగని ఛానీళ్ళతో నెల్లగొడుతడట'' ఓదెలు హాస్యమాడాడు.

''నువ్వు నాకు పీకుడువని సేత్తన్నవని సారా తెప్పిత్తవోయ్'' అని సీరియస్‌గా మారి ''కాలమంతెట్లుందోయ్ సేరుసారకు ఇరువై రొండు రూపాయలాయె అవ్విట్నేమన్న ముట్టచెప్తున్నదా? అన్నాడు మాధవయ్య.

''గాసారా బ్రాండులు మనకెందుగ్గని బావ వాయెపటికె పరాసికమాడితి. పోనియ్‌గని జీతమెంతచ్చిండోయ్'' ఓదెలు.

''ఏ సాటెక్కడొచ్చె. నాలుగు నూర్లేనాయె. పండుగడ్వాన్సుకని దీనికని పోయిన్నెలల అన్ని ట్రయికులేనాయె. బాయి నడిసిందెక్కడ?'' మాధవయ్య.

''పైసలు బాగక్కరుంది బావ. అంతకువముందునెల జరవచ్చి వంటి పోయిన్నెల ట్రయికులాయె. జీతంలేపాయె మన్నులేపాయె. నువ్వే మన్న సదుర్తవని అచ్చిన.'' అసలు విషయం బయట పెట్టాడు ఓదెలు.

''ఇక్కడ ఒగలకొగలు ఇచ్చెటట్లున్నాదోయ్. ఒక్కరోల్లమేకని ఒగలమొకం ఒగలం సూసుకోకుంటనే గావట్టే'' మాధవయ్య.

''నీ దగ్గరేమన్న ఎల్తాయె రాగన్న'' రాఘవయ్య నుద్దేశించి ఓదెలన్నాడు.

''అబద్ధం మాట, నా ఖర్సులునీ కెరుకలేదా? పోరగాండ్ల సాదుకోవన్నాయె. తమ్మునివదినియ్యన్నాయె. అవ్వయ్యకు పంపియ్యన్నాయె. ఘేడ మిగుల్తయి'' రాఘవయ్య తన అవసరాలు చెప్పాడు.

''గంతగనం అక్కరున్నాదె రాగన్న. రామేశం సేఠ్‌నడుగ లేవు'' రాజలింగు సలహా ఇచ్చాడు.

''సేట్ల దగ్గరికి పోయినంక మనిండ్లుంటాయిర. అడ్డగోలుమిత్తి దొబ్బుతరు. నెలకు నూటికి పదయినంక మనమేడ ముంగట వడుతం. అయినాగని అన్నగ్గెథికి పోందెల్లెతట్టులేదు'' ఓదెలు.

''గాడిద కొడుకు వెయ్యి రూపాయలు పట్టుకొని గోదావరిఖనిచ్చిండు. అడ్డీలకిచ్చి అడ్డగోలుగ లక్షలు సంపాయిచ్చె'' మాధవయ్య.

''మనం గట్ల అనుకుంటనే వుంటం. ఆడింక మీదికి పోత వుంటడు'' అని మాధవయ్య ఏడుస్తున్న కొడుకును జోకొడ్తున్నాడు.

''పాపపు సొమ్ము పెరిగి పెరిగి ఎప్పుడోసారి ఇరుగతది'' రాజలింగు.

ఉద్యోగాల కెగబడటం అతని హృదయంపై చెరగని ముద్ర వేసాయి. వాళ్ళంతా ఇక్కడి కొచ్చైనా సుఖపడ్తున్నారా అంటె అక్కడికంటె అధ్వాన్నమైన బ్రతుకే ఇక్కడుందని తనిక్కడికొచ్చేంత వరకు తెలియదు.

ఎవుసం...ంటెవుసం, ఎవుసంల మన్ను పాడయిందా ? యాడాది పొడుగూత మోటుకట్టంజేత్తె దుబ్బ మిగుల్తుందా ? పెట్టుబడికి' కయికల్లకు గంబళ్లకు, తాశీలుకు, మందులకు మన్నుకు మసానానికి పెట్టంగ ఏమన్న మిగుల్తె తిన్నాయె లేకుంటే లేదాయె. అడ్డికిపావు శేరని ఓ అయ్య దగ్గరప్పు దెచ్చి మందేత్తె కలుపుదీత్తె వంట వండివంకమ్మితె పెట్టిన పైసలచ్చుడు కట్టమాయె. ఇగేం జెయ్యాలో. సావుకారప్పు కట్టలేక భూమమ్మినెవుసం పనిల రోజురోజుకు దిగజారుడాయెకని పైకి పోవడు లేపాయె. ఇగ వశపడక గీ బాంచె పని కత్తి'' అన్నాడు రాఘవయ్య.

మాధవయ్య తమ్ముడు కిష్టయ్య తలవంచుకొని వచ్చి రాజలింగు ప్రక్కన మంచంలో కూర్చున్నాడు. తలవంచుకొని కూర్చున్న కిష్టయ్య నుద్దేశించి ఓదెలు

''ఏమోయ్ బావ నీ వెనెక్కడి దాకచ్చె'' అన్నాడు.

కిష్టయ్య ముఖంపై విచారం, నిస్సహాయత. దు:ఖం, ఎన్నో ఆశలతో చదువుకున్న చదువు నిష్ప్రయోజన మౌతుందన్న బాధ. పదిహేను సుదీర్ఘ సంవత్సరాలు ఎన్నో కలలతో పూర్తిచేసిన చదువుకు ఫలితం దక్కలేదన్న వేదన ప్రస్ఫుట మౌతుంది.

అతడు చదువుకొని పెద్ద ఉద్యోగం చేయాలని ఎన్నో ఊహలతో కన్న స్వప్నాలకు పురుటిలోనే సంధికొట్టిందని ఆవేదన చెందుతున్నాడు. అమ్మా, నాన్న, అన్నలు కష్టపడి చదివించిన డిగ్రీ చదువు ఎంకూ కొరగాకుండా పోతున్నందుకు తీరని మనోవేదనతో కుమిలి పోతున్నాడు. ఎంత తిరిగినా దొరుకని ఉద్యోగం కొరకై ఎండమావిలో నీటికొరకులా ఎదిరిచూసి వేసారి పోయాడు. అహోరాత్రులు కష్టపడి సంపాదించుకున్న బి. ఏ. డిగ్రీ చిత్తు కాగితంగా మాత్రమే ముందుపైగా ఉద్యోగాల వేటలో అలసిపోయి ...దకు సింగరేణి కాలరీల్లో ఫిల్లర్‌గా చేరడానికిలగా నిర్ణయించుకోవడం అతని స్మృతి పథంలో మెదిలింది. ఇంట్లో తనపై ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులు తానింత చదివి తుదకు నిరక్షరాస్యుల్లా కాలరీ మజ్దూర్‌చేయడానికి నిర్ణయించుకున్నాననీ చెప్పగానే వాళ్ళు పడ్డబాధ అతనికి జ్ఞాపకమొచ్చింది. తన కుటుంబం, తనపాలి వాళ్ళ కుటుంబాలు తన ఊళ్ళో ఎంత మంది తన లాంటి కాపు కుటుంబాలు వ్యవసాయాలు నడవక చితికి పోవడం, దూరపుకొండలు నునుపని ఆశించి సింగరేణికి రావడం జ్ఞాపకం వచ్చింది.

రాఘవయ్య తాను ప్రాణదాధికంగా ప్రేమించిన భూమిని నిలుపుకోవడానికై పడ్డపాట్లు, అయినా దాన్ని నిలుపుకోలేక పోవడం జ్ఞప్తికొచ్చి ఆవేదన చెందాడు.

భూమినే నమ్ముకొని వ్యవసాయం చేసి పైకి రావాలని ఎంతో ప్రయత్నించిన అన్న తుదకు అలసిపోయితాను ప్రాణాధికంగా ప్రేమించిన మట్టిని వదులుకొని తట్టమోసే పనికి సింగరేణి రావడం అతడు మరచిపోలేదు. పుట్టి పెరిగిన ఊరును. ఆడిపాడిన ప్రదేశాలను, కలిసి మెలసి కష్టాల్లో సుఖాల్లో పాలికేండ్లు జీవించిన ఊరి ప్రజలనున, వాళ్ళ నిష్కల్మష ప్రేమమయ హృదయాలనువదలి భారమైన హృదయంతో తన అన్న ఇక్కడికి వచ్చిన సంఘటన అతనికింకా జ్ఞాపకముంది. కండ్లు నిండ నీటితో, మాట్లాడితే వర్షించేట్టున్న హృదయంతో కని పెంచిన తల్లిదండ్రులనొదిలితన అన్న, అతని లాంటి ఎంతో మంది ఊరి ప్రజలు ఊళ్ళు వదలడంకిష్టయ్య స్మృతిలో ఉన్నాయి. కంటికోధారగా ఏడుస్తూ తమ పిల్లలను సింగరేణి మృత్యు కూపాల్లోకి పంపిన తన ఊరి ముసలి తల్లిదండ్రులెందరో అతని కళ్ళముందు కదులుతున్నారు.

వెనుకెనుకకు చూస్తూ వదలలేక వదలినట్టు ఊరొదలిముళ్ళుమూటలతో వచ్చిన ఎంతో మంది ఊరి వాళ్ళు అతనికి జ్ఞాపకమొచ్చారు. వ్యవసాయ కుటుంబాల వాళ్ళు గొల్లవాళ్లు, హరిజనులు, తెనుగువాళ్ళు, గౌండ్లు మరెంతో మంది వివిధ కులాల వాళ్ళు తమ మధ్యనున్న సహజీవనాన్ని వదలి ఈ యాంత్రిక జీవితాన్నాశించి రావటం అతనిపైగాఢ ముద్రవేసాయి. తాను కష్టపడి చదువుకొని తన కుటుంబానికాధారం కావాలని, తన కొరకు రెక్కలు ముక్కలు చేసుకున్న అన్న కుటుంబాన్నాదుకోవాలని తాను కాలేజీలో ఉన్నప్పుడు చేసుకున్న నిర్ణయం జ్ఞప్తికొచ్చి మదన పడ్డాడు. కాని తాను కూడా అన్న వలెనే అదే పనికి పోవలసివస్తుందని కిష్టయ్యెప్పుడూ ఊహించలేదు.

ఓదెలుమాటలకు కిష్టయ్య జవాబివ్వలేదు. తల వంచుకొని కూర్చున్నాడు.

''ఏమోయ్ ఇయ్యంకుడా ఎట్లనోన్నట్టున్నవేంది?'' మళ్ళీ ఓదెలే అడిగాడు.

''ఏంజెయ్యాలె? ఐదువేలిచ్చార్నెల్లాయె. పైరవికారి చుట్టు తిరిగి తిరిగి కాళ్ళు అరుగవట్టె, యాష్టకు రావట్టె. పనయితె అయిందిలేదేం లేదు'' అన్నాడు కిష్టయ్య నిర్లిప్తంగా.

''ఐతేమాయెగని ఏమన్నడ్రా నారాయణరావు?'' మాధవయ్య.

''ఏమంటడు. ఇగయిత దగయిత దంటడు గని ఎప్పుడయితదో చెప్పడు ఎప్పుడయిద్దో ఏమో''

''నువ్వేం జేత్తవు? అయ్యేటప్పుడదేతది'' మాధవయ్య తమ్మునికి ధైర్యం చెప్పాడు.

సుగుణ తెచ్చిన టీ చప్పరిస్తూ కూర్చున్నాడు కిష్టయ్య. ''గింతగనం సదివి నువ్వు గూడ కూలి పనికే అచ్చుడా పటేల. నీ యవ్వకాలమంతెట్లున్నది?'' రాజలింగు మాటల్లో ఆవేదన.

''గాపని గీపని అనెటట్టున్నాది. ఏదో ఓటి. పొట్టతిప్పలకు జేరి పోతులాటని సేత్తే ఐపాయె. కాలమేమన్న బతుకచ్చేట్టున్నదా?'' అని ఓదెలు రాఘవయ్య నుద్దేశించి.

''నాకంటె పేసుకుందామన్నా ఏం లేకపాయె. ఎల్లకత్తి. మంచి ఎవునమున్న నువ్వేందుకు గీ లేకిడి పనికొచ్చినవు పటేల'' అన్నాడు.

అతని మాటలకు రాఘవయ్యొక నిట్టూర్పు విడిచిండు.

సుగుణ నాలుగు చిన్నస్టీలు గ్లాసుల్లో టీ తెచ్చి నలుగురి కిచ్చింది. మాధవయ్య చేతిలో నుండి కొడుకును తీసుకొని బొగ్గు బకెట్‌ను పట్టుకొని గుడిసె లోపలికెళ్ళింది.

కాలే టీని ఊదుకుంట తాక్కుంటూ మాటల్లో పడ్డారు వాళ్ళు:

''ఇక్కడేమొ సంపాయిత్తమని వత్తిమిగని ఏం పాడయింది ఎంతజేసినా ఎక్కడేసిన గొంగడి అక్కడే ఉన్నట్టు గావట్టె. ఊళ్లంటె మంచిగాలన్న దొరకేది. ఇక్కడ అదిగూడ కరువేనాయె'' మాధవయ్య.

''ఇక్కడికచ్చి బాగుపడ్డోల్లు లేరంటవా బావ?'' రాఘవయ్య.

''ఎంత బాగుపడ్డా నూటికి ఒగలిద్దరుండ వచ్చు. నోరుగట్టుకొని ఆరోగ్యమంత పాడుగాంగ తిప్పలు పడితెనాలుగు పైసలు ఎనుక వడుతయేమొకని దుబ్బ మిగుల్తదా? మనకు తెలిసినోల్లండ్లగౌడ్లరాజయ్యిప్పుడు అస్థిపంజరం లెక్కచ్చెటట్టుయినా నాలుక్కొత్తలెనుకేసిండు'' మాధవయ్యన్నాడు.

''నీబొందనాయంగపోతె ఆడేం సంపాయిచ్చు. వెయ్యి రొండు వెయిలో మొదలు కూడబెట్టిండు. అవిట్ని ఊళ్ళెమస్కట్‌కు పోయెటోల్లకు అడ్డుగోలు మిత్తికిచ్చి నాలుగు పైసలెనుకేసిండు. లేకపోతె గంతగన మేడ సంపాయించెటోడు'' అన్నాడు ఓదెలు.

అందరు టీలు తాగి గ్లాసులు కిందబెట్టిండ్రు. రాజలింగు మాత్రం అలాగేపట్టుకొని

''కొన్నినీళ్ళు పొయ్యవ్వ కడిగిత్త'' అని సుగుణ నడిగాడు.

''గవ్వేమ్మాటల్ర రాజలింగు. అవ్వన్నిక్కడ సాగవు. అక్కడ వెట్టు'' అనగానే గ్లాసు క్రింద బెట్టాడు.

''ఐతెమానాయెగని ఎందుకో వత్తివి సెప్పకపోతివి'' మాధవయ్య.

''అట్టిగనే అచ్చినపటేల.సాన్రోజులాయె అట్ల వూటాల్లాడి పోదామని'' రాజలింగు మాదవయ్యతో అన్నాడు.

'ఏపుసమంటెవుం, ఎవుసంల మన్ను పాడయిందా? యాడాది పొడుగూత మోటుకట్టం జేత్తే దుబ్బ మిగుల్తందా? పెట్టుబడికి' కయికల్లకు గంబళ్ళకు, తాశీలుకు, మందులకు మన్నుకు మసానానికి పెట్టంగ ఏమన్న మిగుల్తె తినన్నాయె లేకుంటె లేదాయె. అడ్డికిపావు శేరని ఓ అయ్య దగ్గరప్పు దెచ్చి మందేత్త కలుపుదీత్తె పంట పండినంకమ్ముతె పెట్టిన పైసలచ్చుడు కట్టమాయె. ఇగేం జెయ్యాలె? సావుకారప్పు కట్టలేక భూమమ్మినెవుసం పనిల రోజురోజుకు దిగజారు నాయెకని పైకి పోవడు లేపాయె. ఇగ వశపడక గీ బాంచె పని కత్తి'' అన్నాడు రాఘవయ్య.

రాఘవయ్య తాను ప్రాణాధికంగా ప్రేమించిన భూమిని నిలుపుకోవడానికై పడ్డపాట్లు, అయినా దాన్నినిలుపుకోలేక పోవడం జ్ఞప్తికొచ్చి ఆవేదన చెందాడు.

''సరెగని సాలయినె మాకంటె ఎవుసం పనిల గూడ మోటుకట్టం జేసుడవాటేనాయె. మాకే బాయిపని పెద్ద కట్టంగేముండది. బ్యారం జేసుకుంట బతికెటోనివి గిదిసెయ్యన్నంటె తిప్పలయిత లేదా నోయ్. అయినా నీ బ్యారం మంచిగానే నడుత్తంది గద గీలేకిడుపనికెందుకచ్చినవు!'' మాధవయ్యన్నాడు.

ఓదెలొకసారి లేచి సర్దుకొని కూచొని

''ఎంటికలున్న కొప్పు ఏటు ముడిసినా అందమే నంటరు పదిరువై వేల పెట్టుబడుండి దుకాణం బెడితె ఓ తీరుగ నడుత్తది. నన్నుమ్మినా గన్ని ప్రసంత్తయ్యా? గీ కాలంల మొగ్గం నేసుకుంట బతుకన్నంటె ఏన్ను మిగుల్తదా? మొగ్గం నేత్తేంలాబంలేదని సైకిల్మీద మూట పెట్టుకొని తిరుక్కుంటమ్ముడు ... వెట్టిన. కొన్ని రోజులు మా నడిసింది గని తిరుగెటోల్లు బాగయి గిరాకి తక్కో అయింది. ... ఊరూరుకి పైసలు న్నోడుదుకాణం పెట్టినంక ఇగ మా దగ్గరెవ్వలు కొంటరు? కొన్రోజులాదిలాబాద్ దిక్కు కూడ పొయ్యమ్మిన. ఇప్పుడక్కడ కొయ్యోల్లు, గొండోల్లు కూడ తెలివికచ్చింద్రు. మునుపు 20 రూపాయల చీరను 60 రూపాయల కమ్మినా అడిగెటోడులేడు. ఇప్పుడట్ల నడుస్తలేదు. వెయి, రెండువేలు షావుకారి దగ్గరప్పుదెచ్చి మాల్కొంటె వోసారి అమ్ముడు పాయె. వోసారి పోకపాయె. షావుకారి కమ్మెతేంది? అమ్మకుంటేంది? మిత్తయితేగట్టన్నాయె. అచ్చిన లాబంల మేమేం దినాలె? మిత్తేంగట్టాలే? ఒక్కొక్కసారి షావుకారి ముళ్ళొల్లడే కట్టెంగానట్టె, ఇగ ఇదంత బాగలేదని కట్టమో సిట్టోరమో గీ బాయిలపని దొరికిచ్చుకున్న, కట్టమయినా, సుఖమయినా సెయ్యక తప్పుదా?'' అన్నాడు.

''పురాణం సెప్పినట్టె సెప్పితివి గద ఓదెలు''. అని ''రాయలింగూ ఏ బాయికి పజ్జేత్తన్న విప్పుడు. బాయిపనికి చేసిన బాకీలు తీర్తివార'' అన్నాడు రామవయ్య.

'నేను నైనిన్లయినుకు పజ్జేత్తన్న పటేల. బాకీలింకేడ తీరినయి. కొంచెంబాకా ఆరేడు వెయిలు పనికె పెడితి. నెలకిన్నూరుమిత్తే కట్టన్నాయె బాయిలు సక్కగ నడిసిందెప్పుడు నడిసినా నాగవొకుంట సెయ్యనంటె నామంచయితదా? నాగపోకుంట జేత్తే 7, 8 నూర్లు మావత్తయిగని ఆండ్ల నాలుగైదు నూర్లు

ఖర్సులే అయె. ఇగ బాకీ లెన్నడు తీరాలె?'' అన్నాడు.

''ఖర్చులు ఖర్చులంటున్నవు. నాలుగైదు నూర్లేంజేత్తవుర. లింగిలిటుకని ఇద్దరాలు మొగలకే గంత ఖర్సయిద్దార. ఇంటికాన్నుంచి బియ్యమేమన్న తెత్తన్నవా లేదా!'' మాధవయ్యన్నాడు.

''అవ్వయ్య సంపాయించిన భూములల్ల పండిసపంట తేవన్నాపటేల అక్కన్నయినా ఇక్కన్నయినా కొనుడేనాయె. ఇద్దరికయితె మాత్తురం ఖర్సు తక్కే అయితంద. అచ్చిపోయెటోల్లు తక్కేన కిలనూనెకు ఇరువయాయె. కిలో బియ్యానికి నాల్రూపాయల దగ్గరుండె. ఇగ ఎన్ని పైసలత్తేముంది? ఊళ్ళుంటె రోజు పని దొరకదని ఇక్కడికత్తె ఇక్కడేం సుఖం కనపడుతలేదు'' రాజలింగు బాధ.

''ఖర్సు ఖర్సంటవు నీకేమన్న తాగుడలువాటున్నాదిర'' ఓదెలు.

''అలువాటని ఏం లేదే! కని పుట్టెడు బండకిందకి పొయ్యి తల్లి కడుపుల కెళ్ళచ్చినట్టు మీది కచ్చెటాల్లకు కాల్జేతులు సల్లవడె నడంగుంజె సొతగాకుంటాయె. ఇంటికన్న పొయ్యి రెట్టు తీసుకుందామంటెఅక్కడ ఇంటిముట్టు వాసన. బురద, దోమలు కాసేపన్న కునుకు పట్టకపాయె. ఇగ ఈ జనుమకు తురితెక్కడుందే ఓదన్న. అందుకోసమే అలిట్టతోని మీది కచ్చినంక సానోదో సానో ఏసుకుంటెకొంచెం తురితుంటది. కంటినిండ నిద్రపడుతది.'' పాతికేళ్లు నిండని రాజలింగు వేదాంతం చెప్పాడు.

వాళ్ళ మాటలు వింటూ మౌనంగా కూర్చున్నాడు కిష్టయ్య. ఏదో సాదిద్దామని, సంపాదిద్దామని ఊళ్ళొదిలి కాలరీల వెంటబడుతున్న గ్రామీణుల బ్రతుకులను చూస్తూ జాలి పడుతున్నాడు కిష్టయ్య. ఈ కార్మికులు త్రాగుబోతులనీ, బాధ్యత లేకుండా ప్రవర్తిస్తారనీ వీళ్ళ గూర్చి నానారకాలుగా అనుకుంటారు. కాని వీళ్ళ కష్టానికి, మనశ్శాంతికి, తామనుభవించే దుర్భర కష్టపూరిత జీవితాలను తాత్కాలికంగానైనా మరచిపోవడానికి వాళ్ళకు త్రాగడం తప్పని సరేమో అనిపిపిస్తుంది. కొంతమంది తప్పితె చాలామంది అవసరానికే త్రాగుతారన్నది పచ్చినిజం అనుకున్నాడు కిష్టయ్య.

''ఊరోల్లంత ఇక్కడికే రావట్టిరి. మనూరొల్లు నూరుమందున్న రంటాపుర రాజలింగు'' మాధవయ్య అన్నాడు.

''ఏం నూరు పటేల పాతునూరు, సిక్సింక్లైన్ గడ్డకే యాభై మందుంటరు. ఈ ఫైవింక్లైనుకు 30, 40 మందుండిరి. ఇంక యైటింక్లైన్, నైన్లైన్లకొద్ది మందున్నరా? కొత్త టాకీసెనుక, బస్సుస్టాండుకాడగూడ బాగనే ఉండ్రి. అంత గలుపుతె ఒల్లక్కానికి ఇన్నూరు దాటుతరు'' రాజలింగన్నాడు.

''ఊళ్ళ కూళ్ళు వదిలి గోదావరిఖని మీద పడవట్టిరి'' రాఘవయ్య బాధ.

''ఊళ్ళల్లిగ ఎవుసం సేసెటోళ్ళెవలు'' మాధవయ్య.

''రాజువోతె రాజరికం పోతదా బావ. ఏది జేసెటోళ్ళది సేత్తనే వుంటరు'' ఓదెలు.

''మరిక్కడి కచ్చి ఏంజంపాయిచ్చినట్టయిందోయ్'' మాధవయ్య.

''దుబ్బ. మనమొకం మంచిగ లేక అద్దం నాలొగ్గొడితే మత్తది? అక్కడుంటె సుబ్బరంగ గాలి, నీళ్ళన్న దొరికేటియి. ఇక్కడవ్వి గూడ కరువేనాయె. అక్కడ దొరలు, సావుకార్లు దోత్తె ఇక్కడ బాయిదొరలు, దొంగలీడర్లు, గుండాలు, వడ్డీకిచ్చెటోళ్ళు దోయపట్టిరి. ఎక్కడికి పోయినా మనసొంటోళ్ళ బతుగ్గింతే. గా అవుతలికి సూడు ఉరంత మబ్బుపట్టినట్టు బొగ్గు పొగెట్లున్నదో. ఒగదిక్కు బొగ్గుపొయ్యిల వాసన. బురదకంపు వాసన, ఎరువుల కంపిని మందు గ్యాసు వాసన, మోటర్లిడిసే పొగ వాసన, బాయిల్నెము

గ్యాసు. నీయవ్వ ఇక్కడేమన్న ఉండచ్చెటట్టున్నదా? గతికిలేక ఉండడుకని'' రాఘవయ్యన్నాడు.

''ఇగ కట్టమో నిట్టూరమో ఏదో ఓ తీరుగ కాలంగడుపుతెఐసాయె. మనిషి జనుమమెత్తినందుకు దొంగతనాలు, లంజెతనాలు సెయ్యకుంటయిపాయె. సరగని కొంచెమన్న సేపోయి దొరుకుద్ది బావ. సాన్నొజులే ముంచుకోను బోనసచ్చినంక నియ్యి నీకిత్త'' అన్నాడు ఓదెలు మాధవయ్య నుద్దేశించి.

''మారె నాద్గగ్గరెక్కడియి? ఎల్లయని సెప్పితి గదనోయ్'' మాధవయ్యన్నాడు.

''సరే బావపొయ్యత్త' అని మాధవయ్యకు చెప్పి '' ఏమోయ్ ఇయ్యాంపుడా బెల్లం గొట్టినరాయోల కూసుంటివి. ఏం మాట్లాడుతలేవ్వేంది? ఏంజేత్తవోయ్ అట్టిగుండి. అప్పుడప్పుడు మా ఇంటి దిక్కు రాలేవు. మా పేదోల్లింటికత్తె తప్పయిద్దా'' అంటూ లేచి నిలుచున్నాడు ఓదెలు.

''గట్లెందు కంట వోదెలు. ఇండ్ల పేద పెద్దేమున్నది? అందరం పొట్ట చేత బట్టుకొని వచ్చినోల్లమే. వీలుచూసుకొని మావస్త' అన్నాడు కిష్టయ్య.

''సరే వోతన్న'' అనుకుంటూ ఓదెలు వెళ్ళి పోయాడు.

ఓదెలు వెంబడే రాజలింగు కూడా వెళ్లాడు.

''సరే బావ. నేంగూడ పొయ్యత్త. రాత్రి బదిలుంది. మీ చెల్లె ఊకెకలువరిత్తంది. చెల్లెందీసుకొని ఓసారి రాలేవు మా యింటికి'' అని రాఘవయ్య లేచి నిలుచున్నాడు.

''మా అత్తయ్య. మీ ఇల్లేమొ గక్కడెక్కన్నో కొత్త టాకీసెనుకాయె, మాదేమో గిక్కన్నాయె. అక్కడికి రావన్నంటె పనివడ ఊరు పెట్టు రావన్నాయె'' అన్నాడు మాధవయ్య.

''ఇగో గవ్వన్ని సెప్పకు నాకు. రాదలుసుకుంటె ఎట్లనన్న రావచ్చు. ఒక్కూరోల్లం, ఒక్క కులపోల్లం, దగ్గరోల్లం. మా ఇంటి కచ్చుటానికే బరువయిందా? అట్లంటె నేనెట్లత్తన్న మీ ఇంటికి''.

''ఆ నువ్వచ్చిన వప్ప కండెడన్ని సార్లు. నువ్వంటె డ్యూటికి పోవాల ఇట్నుంచే పోవన్నాయె. పోయెటప్పుడో, అచ్చెటప్పుడో యాదికచ్చినపుడు అట్ల కలిసిపోతవేమొ'' అని ''గమ్నొందుగ్గని మావత్త తియ్యి'' అన్నాడు మాధవయ్య.

''సరే ఎప్పుడో త్తవో సూత్త'' అని బయల్దేరిండు రాఘవయ్య.

''బజార్ల నాక్కొంచం పనుంది. నేను గూడ త్తన్నుండు'' అని గుడిసె లోపలికెళ్లి పాంటు షర్టు తొడుకొని బయట కొచ్చాడు మాధవయ్య ఇద్దరూ మాట్లాడుకుంటూ బయటకెళ్ళారు.

పేద, మధ్య తరగతి రైతాంగ కుటుంబాల నుంచి వచ్చిన ఆ కార్మికులు కొన్నేళ్ళుగా ఇక్కడ పనిచేస్తున్నా వాళ్ళలో ఇంకా పల్లీయుల్లో ఉండే ఆప్యాతలు పోలేదు. ఇంకా పూర్తి యాంత్రిక జీవితానికి అలవాటు పడలేదు.

వాళ్ళలోని ఆప్యాయతలను, అనురాగాలను, కోపాలను, తాపాలను, కష్టాలను జీవితానుభవాలను వింటూ మౌనంగా కూర్చున్నాడు కిష్టయ్య. వాళ్ళంతా లేచి పోయినా ఒంటరిగా మంచంలో కూర్చున్నాడు.

కిష్టయ్య మనసంతా కోళ్ళు దవ్విన పెంటలా వుంది. '' ఏం ప్రయోజనమాసించి వేలాది పల్లెజనాలు గ్రామాలువదిలి ఇలా వలస వోతున్నారు? పోనీ వాళ్ళక్కడైనా సుఖ పడుతున్నారా? పల్లెల్లో దుర్భర జీవితాలనుభవించిన వీళ్ళు, ఇలాంటి చోట్ల అంతకంటె దుర్భర జీవితాలనే గడుపుతున్నారు. అయినా ఊళ్ళ కూళ్ళు ఖాళీ చేసి కాలనీల కెగబడుతూనే వున్నారు'' అనుకున్నాడు.

వివిధ రకాలయిన గజిబిజి ఆలోచనలతో కిష్టయ్య హృదయమంతా సళసళ కాగుతుంది. ఆ

రాత్రంతా ఒక్క మాట కూడా మాట్లాడలేదు. అన్నం కూడా సరిగా తిన్లేదు. దేన్నిగూర్చో తీవ్రంగ ఆలోచిస్తున్నాడు. కంటిమీద కునుకు గూడా లేదు. ప్రొద్దున్నేలేచి వదిన అన్న మందలించినా మాట్లాడకుండా ఛా గూడా తాగకుండా బయటకెళ్లాడు. గోదావరిఖని పట్టణ మంతా దుమ్ము తన్నుకుంటూ బొగ్గుల్లాగా కమిలిపోయిన ముఖాలను, బొక్క టోపీలు ధరించి మృత్యుకూపాల్లోకి పోతున్న కార్మికులను చూస్తూ తిరిగాడు. బొగ్గుబాయిమీద సైరన్ కూత కూసినట్టూ - ఆ కూత అంత కంతకు పెద్దదైనట్టు అతనికనిపిస్తుంది.

''ప్రజల దుర్భర జీవితాలకు పరిష్కారం ప్రస్థానంతో పూర్తి కాదు. అది మహాప్రస్థానంగా మారాలి'' అనుకున్నాడు కిష్టయ్య.

ప్రజాసాహితి జనవరి.1985

''నల్లకలువలు'' కథాసంకలనంలోంచి